




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

రంగారెడ్డి
వికారాబాద్
మేడ్చల్

బుధవారం, 27 ఆగష్టు 2025 : పేజీలు 09




# నాటూరు.. నరికారు....

■ మొక్కల సంరక్షణలో అధికారుల నిర్లక్ష్యం..! ■ విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయంటూ విద్యుత్ అధికారుల చెట్ల నరికివేత ■ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్న స్థానికులు

దోమ, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):ప్రభుత్వం ఓ పక్క వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలోని రోడ్లకు ఇరువైపుల మొక్కలని నాటాలని సూచిస్తుంటే, మరో పక్క అధికారులే నాటిన మొక్కలను నరికివేస్తున్నారు. మంగళవారం దోమ మండల మిగతా 3లో



## వినాయక చవితి శుభాకాంక్షలు

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్...



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (ఆగస్టు 26): గణేష్ నవరాత్రుల ప్రారంభం సందర్భంగా వికారాబాద్ నియోజక వర్గం, వికారాబాద్ జిల్లా మరియు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించి, తలపెట్టిన కార్యాలను విజయవంతంగా పూర్తి చేయడానికి అనుగ్రహించే వినాయకుని ఆశిస్సులతో అందరూ సుఖశాంతులతో జీవించాలన్నారు. ఈ తొమ్మిది రోజులు ప్రజలు భక్తి శ్రద్ధలతో వినాయకుని పూజి ంచి ఆశీస్సులు పొందాలని కోరుకుంటు న్నానని స్పీకర్ ప్రసాద్ కుమార్ తెలిపారు.



## సీజనల్ వ్యాధుల నివారణపై.. కలెక్టర్ మను చౌదరి ప్రత్యేక దృష్టి

● ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలి ● విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవు : కలెక్టర్ హెచ్చరిక

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (ఆగస్టు,26):సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి వైద్యాధికారులను ఆదేశించారు.మంగళవారం అల్వాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ల్యాబొరేటరీ, లేబర్ గది, మందుల నిల్వలు, మిగతా 3లో



## కొందుర్గులో చెత్తను ఎక్కడ వేయాలి?

● మొదటి డంపు యార్డ్ వర్షాలకు కూలిపోయింది
● రెండో డంప్ యార్డ్ స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం తీసుకున్నారు



మొదటి డంప్‌యార్డు

కొందుర్గు, మేజర్‌న్యూస్(ఆగస్టు26): మండల కేంద్రంలో చెత్తను ఎక్కడ వేయించాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. మండల కేంద్ర వాసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత ఆరు సంవత్సరాల క్రితం మండల కేంద్రం శివారులోని చెక్కలోని గూడెం వెళ్లే దారి పక్కన చెత్తను వేసేందుకు గాను డంప్‌యార్డును ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ఇండ్ల నుంచి సేకరించిన చెత్తను అక్కడ వేసేవారు. కొన్ని నెలల తరువాత అప్పట్లో కురిసిన వర్షాలకు డంప్‌యార్డు రేకులు గాలికి ఎగిరిపోవడంతో, డంప్‌యార్డు కూలిపోయింది. మిగతా 2లో

## నందిగామ మండలంలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తా...

● బిజెపి నాయకులతో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ
● మండల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని బిజెపి మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఎంపికి వినతి
● వివరాలు వెల్లడించిన బిజెపి నందిగామ మండల అధ్యక్షులు వడ్ల అరవింద్ చారి



నందిగామ, మేజర్‌న్యూస్ (ఆగస్టు 26): నందిగామ మండలంలో పర్యటించి ప్రజాసమస్యల శాశ్వత పరిష్కారా నికి చర్యలు చేపడ్తానని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె. అరుణ హామి ఇచ్చినట్లు బిజెపి నందిగామ మండలాధ్యక్షులు వడ్ల అరవింద్‌చారి తెలిపారు. ప్రస్తుతం గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులు మిగతా 2లో

# రోడ్డుకు ఇరువైపులా దుకాణాల తొలగింపు

**● రైతు బజారు సమీపంలో చిరువ్యాపారులకు దుకాణాలు ఏర్పాట్లు ● చిరువ్యాపారులను ప్రభుత్వమే ఆదుకోవాలి : సీపీఐ**



దుకాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

**చేవెళ్ల, మేజర్‌న్యూస్ (ఆగస్టు 26) :** హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరువ్యాపారుల దుకాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. చిరువ్యాపారుల దుకాణాల ముందు వాహనాలు నిలపడంతో రోడ్డు ప్రమాదాలు, ప్రయాణికులకు ఇబ్బందులు అవుతున్నాయని పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి,కూతుర్ల దుర్మారణం పలువురిని కలచి వేసింది. మరోమారు ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరువ్యాపార దుకాణాలను తొలగించి వారిని రైతుబజార్‌లో ఏర్పాటు చేసుకునేలా చేయాలని స్థానికులు వేడుకున్నారు. మంగళవారం మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న పండ్ల దుకాణాలు, పూల దుకాణాలు,కూరగాయాల దుకాణాలను, వివిధ వ్యాపారాలకు సంబంధించిన డబ్బాలు, వివిధ పార్టీలకు చెందిన జెండా దిమ్మెలను తొలగించారు. మున్సిపల్ అధికారులు చేసిన పనులకు పలువురు అభినందించారు. చిరువ్యాపారులు రోడ్డున పడకుండా ఉండేందుకు వారిని రైతుబజార్ సమీపంలో దుకాణాలను నిలుపుకునేలా పోలీస్‌శాఖ, మున్సిపల్ అధికారులు సూచించారు. సీఐ భూపాల్ శ్రీధర్ సూచన మేరనకు వ్యాపారులు తమ సామాగ్రితో రైతుబజారు సమీపంలో దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు.

**చిరువ్యాపారులను ప్రభుత్వమే ఆదుకోవాలి : సీపీఐ**

చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని చిరువ్యాపారుల దుకాణాలను ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని తొలగించినందుకు వారికి ప్రత్యమ్నాయ స్థలం కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం తెలిపారు. చిరువ్యాపారాలు నెలకొల్పుకుని జీవనం సాగిస్తున్న వారికి తక్షణమే ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు సుధాకర్‌గౌడ్, పాపయ్య, యేసు తదితరులు ఉన్నారు.


వివిధ పార్టీల జెండాల తొలగింపు

# మైసిగండి ఆలయ హుండీకి రూ. 22.48 లక్షలు


హుండీ లెక్కింపులో అధికారులు, అర్చక, ఉద్యోగులు

**కడ్తాల్, మేజర్‌న్యూస్ (ఆగస్టు 26):** కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ, శివాలయ, రామాలయ హుండీలెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ లక్ష్మిసిరోలీ, కార్యనిర్వాహణా. దికారిణి ఆర్.స్నేహలతల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమీషనర్ చంద్రశేఖర్ హాజరై హుండీలెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా భక్తుల నుండి గడిచిన 90 రోజులకు గాను 22 లక్షల 48వేల 653 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ లక్ష్మిసిరోలీ, కార్యనిర్వాహణాధికారిణి ఆర్.స్నేహలతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక ఉద్యోగులు, నిర్వాహకులు ఆర్.పి భాస్కర్, అరుణ్, ఉప ప్రధాన అర్చకులు మాధారం యాదగిరిగౌడ్, బి.చంద్రయ్య, క్రిష్ణ , రాములు, శ్రీనివాసులు, ఆనంద్, వెంకటరమణ, పత్య నాయక్, ,హర్షవర్ధన్, వెంకటేష్ ,బీబీచారి, శ్రీను, అన్నపూర్ణ, సేవా ట్రస్ట్, కెనరా బ్యాంకు సిబ్బంది లక్ష్మి నారాయణ, పోలిస్ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గులో చెత్తను ఎక్కడ వేయాలి?





**మొదటిపేజీ తరువాయి...** దీంతో రెండో డంప్ యార్డు నిర్మాణం కోసం 2020లో జాతీయ గ్రామీణ ఉపాధి హామి నిధులు 2.50లక్షలు మంజూరు కావడంతో, మండల కేంద్రం శివారులోని స్కాన్ పరిశ్రమ వెనకాల 20 గుంటల భూమిలో డంప్‌యార్డును 2.14 లక్షలతో ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను డంప్‌యార్డులో వేసేవారు. ఇంత వరకు సజావుగా సాగగా, కొందుర్గు మండల కేంద్రానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు కావడంతో, ఆ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు స్కాన్ పరిశ్రమ వెనకాల ఉన్న ప్రభుత్వ స్థలాన్ని విద్యాశాఖ వారికి అప్పగించారు. దీంతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను ఆ స్థలంలో ఏర్పాటు చేసేందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత సంవత్సరం అక్టోబర్‌లో శంఖుస్థాపన చేశారు. ఇంటిగ్రెటేడ్ పాఠశాల నిర్మాణం కోసం అధికారులు 16 ఎకరాల 20 గుంటల భూమిని కేటాయించారు. కానీ అదనంగా మరింత భూమి కావాలని ఉన్నతాధికారులు కోరడంతో, పక్కనే ఉన్న డంపింగ్ యార్డును కూడా ఇంటిగ్రెటెడ్ పాఠశాల కోసం కేటాయించారు. తాజాగా ఇంటిగ్రెటెడ్ పాఠశాల నిర్మాణం పనులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ నెల 23న ప్రారంభించారు. పనుల ప్రారంభంతో స్కాన్ పరిశ్రమ వెనకాల ఉన్న డంప్‌యార్డులో చెత్తను వేయనియడం లేదు. దీంతో గత రెండు రోజులుగా మండల కేంద్రంలో సేకరించిన చెత్తను వేసేందుకు స్థలం లేకపోవడంతో, కొందుర్గులో చెత్త సమస్య ఏర్పడింది. చెత్తను ఎక్కడ వేయాలో పంచాయితి అధికారులు తెల్చుకోలేకపోతున్నారు. మండల కేంద్రంలో రెండు డంప్‌యార్డులు ఏర్పాటు చేసినా, ఒకటి కూలిపోవడం, రెండో డంప్‌యార్డు స్థలాన్ని ఇంటిగ్రెటెడ్ పాఠశాలకు కేటాయించడంతో, వాటి నిర్మాణానికి ఉపయోగించి నిధులు నిరూపయోగంగా మారాయి. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల కొందుర్గు మండల కేంద్రంలో చెత్త సమస్య ఏర్పడింది. కొత్త స్థలాన్ని చూసి చెత్త సమస్యను పరిష్కారం చేయాలని మండల కేంద్ర వాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు ముందుచూపుతో భవిష్యత్తులో ఇబ్బందులు రాని స్థలాన్ని చూసి, మూడో డంప్‌యార్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.




### నందిగామ మండలంలో పర్యటించి

# సమస్యలు పరిష్కరిస్తా...

మొదటిపేజీ తరువాయి...



కేంద్ర నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నదని గ్రామాల వేగవంతమైన అభివృద్ధికి ఎంపీ నిధుల నుండి కూడా వ ంండ లాభి వృద్ధి కి సహకరిస్తానని తెలిపారని ఆ ర వింద్ చా రి వివరించారు. ఈమేరకు నందిగామ మండలంలో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పార్లమెంట్ సభ్యురాలు డికె అరుణను కలిసి వినతిపత్రం అందజేసినట్లు అరవింద్‌చారి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలు, తాండాల మధ్య సరైన రహదారులు లేక ప్రజల ఇబ్బందులతో పాటు ఇతర సమస్యలు ఎంపి దృష్టికి తేగా తొందరలోనే నందిగామ మండలంలో పర్యటించనున్నట్లు ఎంపి అరుణమ్మ హామి ఇచ్చారని ఆయన వివరించారు. ఎంపికి వినతిపత్రం అందజేసినవారిలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు అశోక్ గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి అన్నారం రాజు, మండల ప్రధానకార్యదర్శి నర్సింహ గౌడ్, నాయకులు హేమంత్ నాయక్, సత్యం, రాజశేఖర్, జంగయ్య , సురేష్ తదితరులు పాల్గొన్నట్లు అరవింద్‌చారి వివరించారు.

# విద్యుత్ అధికారుల బస్తి బాట



**జల్ పల్లి, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** జల్ పల్లి మున్సిపాలిటీ వాది ఏ ముస్తఫా ప్రాంతంలో మంగళవారం విద్యుత్ అధికారులు బస్తిబాట కార్యక్రమం నిర్వహించారు. కందుకూరు డిఈ గోపాలకృష్ణ, ఏఈ ఎల్ వి సత్యనారాయణ, జల్ పల్లి బిఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షులు షేక్ అఫ్జల్, విద్యుత్ సిబ్బందితో కలిసి పహాడి షరీఫ్ సెక్షన్ జల్ పల్లి మున్సిపాలిటీ, వాది ఏ ముస్తఫా బస్తీలో పర్యటించారు. అక్కడున్న ప్రజలను విద్యుత్ వినియోగంలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకొని, విద్యుత్ వినియోగంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేలా కృషి చేస్తామని అన్నారు. ప్రతి వారం కాలనీ, బస్తీలలో పర్యటించి, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే విద్యుత్ స్తంభాలకు అనుమతి లేకుండా ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లు తొలగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలాపూర్ గణేష్ మండపం వద్ద భారీ బందోబస్తు

**రోడ్డు మార్గంలోని ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ సునీత రెడ్డి, ఏసీపీ జానకి రెడ్డి**

జల్ పల్లి, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):గణేష్ ఉత్సవాలను పునస్కరించుకొని బాలాపూర్ గణేష్ మండపం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతా రెడ్డి తెలిపారు. మంగళవారం ఏసీపీ జానకి రెడ్డి, ఇన్స్ పెక్టర్ సుధాకర్ తో కలసి, బాలాపూర్ గణేష్ మండపం వద్ద, బాలాపూర్ కు వచ్చే మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ. ఇన్స్ పెక్టర్ లు ఎస్ఐలతో పాటు రెండు వందల మంది పోలీస్ సిబ్బందితో బాలాపూర్ గణేష్ వద్ద బందోబస్తు లో ఉంటారని, బాలా పూర్‌కు వచ్చే అన్ని మార్గాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. బాలా పూర్ గణనాథుని దర్శనానికి వచ్చే భక్తులు, పోలీసులకు నిర్వాహకులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అనుమానస్పద స్థితిలో ఓ యువకుడి మృతి




ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26) : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం. వెస్ట్ బెంగాల్, మాల్ట జిల్లా, గాజోల్ గ్రామానికి చెందిన ప్రొసెన్‌జెట్ లోహర్(18) పోచారం మున్సిపాలిటీ, ఇన్ఫోసిస్ సమీపంలోని ఎఎస్ బీఎల్ నిర్మాణసంస్థ లేబర్ క్యాంప్ లో ఉంటూ కూలిగా పనిచేస్తుంటాడు. అతనితో పాటు అనిమెష్ సర్కార్(20), సుజయ్ ఘోస్(19), జీత్ ఘోష్(18)లు అదే లేబర్ క్యాంప్ లో పనిచేస్తుంటారు. గత రెండు రోజుల క్రితం ప్రొసెన్‌జెట్ లోహర్ సెల్ ఫోన్ పాడుకావడంతో బాగుచేయించడానికి అన్నోజిగూడలోని ఓ మొబైల్ దుకాణంలో రిపేర్ కు ఇచ్చాడు. సోమవారం రాత్రి ప్రొసెనెజెట్ పనిముగించుకొని సెల్ఫోన్ తీసుకురావడానికి అన్నోజిగూడ వెళ్లి ఫోన్ తీసుకోని రాత్రి 8.30 గంటలకు లేబర్ క్యాంప్‌కు వచ్చాడు. కోపంగా ఉన్న లోహర్‌ను అనిమెష్ సర్కార్ ఏమైందని అడుగగా ఫోన్ రిపేర్ కోసం తన తండ్రి బికాస్ లోహర్ డబ్బులు ఇవ్వలేదని, దీంతో కోపం వచ్చి సెల్ ఫోన్ పగులగొట్టినట్లు తెలిపారు. నలుగురు కలిసి భోజనం చేసిన తరువాత మిగత ముగ్గురు స్టోర్‌రూంకు వెళ్ళగా ప్రొసెన్‌జెట్ లోహర్ మాత్రం అక్కడే పడుకున్నాడు. మంగళవారం ఉదయం ప్రొసెన్‌జెట్ డోర్ తీయకపోవడంతో కిటికిలో నుంచి చూడటంతో ఉరివేసుకొని వేలాడుతు కనిపించగా అనిమెష్ సర్కార్ నిర్మాణసంస్థ ప్రతినిధులకు సమాచారం అందించాడు. రూంవద్దకు చేరుకున్న ప్రతినిధులు బలవంతంగా డోర్ తెరిచి చూడగా ప్రొసిన్‌జెట్ లోహర్ ఉరివేసుకోని మృతిచెందినట్లు ఉన్నాడు. అతని మెడ కమిలి, గొంతు భాగంలో రక్తగాయం ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా గొంతుపై రక్తగాయం ఉండటంతో అనుమానంతో క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. లోహర్‌ది హత్యనా, ఆత్మహత్యనా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పదస్థితిలో కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# వికారాబాద్‌లో వినాయక మండపాల వద్ద బురద

**- స్పందించని మున్సిపల్ అధికారులు**

వికారాబాద్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26): పట్టణంలో నేడు జరగబోయే గణపతి ఉత్సవాల నేపథ్యంలో వినాయక మండపాల పరిసరాలు చెదురుముదురు పరిస్థితుల్లో ఉన్నాయి. ప్రతి సంవత్సరం మండపాల దగ్గర బురద ఉంటే మున్సిపల్ అధికారులు వెంటనే డస్ట్ వేయించేవారు. అయితే ఈసారి మున్సిపల్ కమిషనర్ కి పలుమార్లు ఫోన్ చేసినా, స్వయంగా వెళ్లి విజ్ఞప్తి చేసినా ఎటువంటి స్పందన కనిపించలేదని మండప
ని ంా ్వ ఎ ా క ు ల ు




ఆరోపిస్తున్నారు. వర్షాల కారణంగా వినాయక మండపాల చుట్టూ బురదతో పాటు పిచ్చిమొక్కలు పెరిగి ఉన్నాయని, వెంటనే డస్ట్ వేయించి శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. "హిందూ పండుగలకు సంబంధించిన వినతులను ఎందుకు అధికారులు ఇంత చులకనగా చూస్తున్నారు..? పట్టణంలో కాషాయ జెండాలు కట్టినా వెంటనే తొలగిస్తారు. అదే అధికార పార్టీల జెండాలైతే ఎన్ని రోజులైనా పట్టించుకోరు," అని మండప నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అభ్యర్థన మేరకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, వినాయక మండపాల పరిసరాలను శుభ్రం చేసి డస్ట్ వేయించాలనే బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**వికారాబాద్ డెస్క్,మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిసిసి ఉపాధ్యక్షుడు బోలు సాని భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బి. ఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం పరిధిలోని రాంనగర్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నూతన కార్యవర్గం పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేయాలని అన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా గొల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా క్రిస్టియ నాయకును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్ కుమార్ రెడ్డి, రాంనగర్ నూతన కార్యవర్గం ఉపాధ్యక్షులు హీర్య నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, యూత్ అధ్యక్షులుగా గోపాల్, బిసి సెల్ అధ్యక్షునిగా కృష్ణ ప్రసాద్, ఎస్టీ సెల్ అధ్యక్షునిగా శ్రీను నాయక్, సలహాదారులు రామచంద్రయ్య, రాగ్య నాయక్, సాయికుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



**నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న మండల కాంగ్రెస్ నాయకులు.**

# ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు.....

**దౌల్తాబాద్, మేజర్ న్యూస్(ఆగస్టు 26):** మండల పరిధిలోని నెలకొన్న ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో తహసిల్దార్ గాయత్రికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ.... ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి అన్నారు. మండలంలో పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్న బస్సులు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు.కావున బస్సు లు ఏర్పాటు చేయాలి అన్నారు. మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ 24 గంటలు సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్, అసెంబ్లీ కన్వీనర్ కొండ్రు నర్సింలు,మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు సతీష్ ముదిరాజ్,జనరల్ సెక్రెటరీ రాజశేఖర్,అంజన్ కుమార్,మోహన్ రెడ్డి, కార్తీక్,మల్లేష్,వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.



# నాటారు.. నరికారు...

మొదటిపేజీ తరువాయి...



పరిధిలోని బాస్పల్లి, బొంపల్లి గ్రామాల సమీపంలో విద్యుత్ అధికారులు హరితహారంలో నాటిన మొక్కలను సగభాగంలో నరికివేశారు. మోత్కూర్ సబ్ స్టేషన్ నుంచి బొంపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓ రైస్ మిల్కు ఇటీవలే 11 కేవీ లైన్ ను కేటాయించి ట్రాన్స్ ఫార్మర్ను ఇచ్చారు. అయితే లాగిన 11 కేవీ వైర్ల కంటే ముందే గతంలోనే హరితహారం కింద గ్రామ పంచాయతీ కార్యదర్శులు చెట్లను "నాటగా అవి పెరిగి పెద్దగా అయ్యాయి. రైస్ మిల్లు కు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందనే నేపథ్యంలో అధికారులు పెరిగిన చెట్లను సగభాగంలో నరికివేశారు. దీంతో స్థానికులు అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో మొక్కలు నాటే సమయంలో ఓ మేక మేత మేసిన అట్టి మేక యజమానికి రూ.500 జరిమానా విధించే అధికారులు..ఏపుగా పెరిగిన మొక్కలను సగభాగంలో విద్యుత్ అధికారులు నరికివేస్తే విద్యుత్ అధికారులకు ఎంత మేర జరిమానా విధిస్తారని స్థానికులు వేచిచూస్తున్నారు. కేవలం రైస్ మిల్ కోసం చెట్లను నరికి వేయడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. వెంటనే చెట్లను నరికి వేసిన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# సీజనల్ వ్యాధుల నివారణపై.. కలెక్టర్ మను చౌదరి ప్రత్యేక దృష్టి

మొదటిపేజీ తరువాయి...

ఆసుపత్రికి సంబంధించిన పలు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఇమ్యూనైజేషన్ ప్రక్రియపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. రోగులకు అందిస్తున్న మందులను సక్రమంగా వాడేలా ఆశా వర్కర్లు పర్యవేక్షించాలనీ, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలనీ సూచించారు. ఫీవర్ సర్వే నిర్వహణపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ సర్వే ను వేగవంతంగా నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.ఆరోగ్య కేంద్రంలో రోగులతో కూడా కలెక్టర్ ముచ్చటి ంచారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై సమాచారం తీసుకున్నా రు. వైద్య సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆయన ఆదేశించారు.అలాగే మందుల నిల్వలను క్రమం తప్ప కుండా తనిఖీ చేసి, కాలం చెల్లిన మందులను వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రులతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని ఆయన ప్రత్యేకంగా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ సీ.ఉమా గౌరి, డా. శైలజ, డిప్యూటీ తహసీల్దార్ పృధ్వీ, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏసిఆర్స్ భృంగీ కళాశాలలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ




**వికారాబాద్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):**ACRS భృంగీ కళాశాలలో మంగళ వారం విద్యా సంస్థల కార్యదర్శి ఏ. ప్రమీల చంద్రశేఖర్ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని తెలియచేసెందుకు ప్రతి సంవత్సరం మట్టి గణపతి కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. ఇది మన అందరి సామాజిక భాధ్యత అని ఆమె గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో శివప్రసాద్, కుమారస్వామి ,రమాదేవి ,మహేందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# థ్యాంకు.. కమిషనర్ గారూ..!

- సూర్య కథనానికి స్పందించిన ఆమనగల్లు మున్సిపల్ అధికారులు
- గుర్రంగుట్ట కాలనీలో బురదమయంగా మారిన అంతర్గతరోడ్డులో మొర్రం మట్టితో చదును
- సమస్యను వెలుగులోకి తెచ్చిన సూర్య దినపత్రికకు, సమస్య పరిష్కరించిన మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు



వర్షం నీటితో బురదగుంటను తలపించిన అంతర్గతరోడ్డు ( ఫైల్ ఫోటో)

ఆమనగల్లు, మేజర్‌న్యూస్ (ఆగస్టు 26): గతకొన్ని రోజులుగా ఎడతెరిపిలేకుండ కురిసిన వర్షాలతో ఆమనగల్లు మున్సిపాలిటి 6వ వార్డు పరిధిలోని గుర్రంగుట్ట కాలనీలో అంతర్గతరోడ్డుపై ఇండ్లమధ్య వర్షం నీరు నిలిచి బురదగుంటగా మారింది. ఈ నేపథ్యంలో కాలనీవాసులు దోమల బెడద, అంటువ్యాధుల భయంతో అల్లాడుతున్న విషయాన్ని ఈనెల 22న సూర్య దినపత్రిక వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన మున్సిపల్ కమీషనర్ శంకర్ కాలనీవాసుల ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ రామకృష్ణతో పాటు మున్సిపాలిటి ఇంజనీరింగ్ ఏఇ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షర్ఫులకు సూచనలివ్వడంతో మంగళవారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ షర్ఫులు కాలనీలో బురదగుంటగా మారిన అంతర్గతరోడ్డుపై మొర్రంమట్టి పోయించి చదునుచేయించారు. దీంతో తమ సమస్య పరిష్కారం కావడం పట్ల మున్సిపల్ అధికారులు, సమస్యను వెలుగులోకి తెచ్చిన సూర్య దినపత్రికకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





అంతర్గతరోడ్డులో మొర్రంమట్టితో చదునుచేయిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సమస్య పరిష్కారమ్పై కాలనీవాసుల ఆనందానికి కారణమైన అంతర్గతరోడ్డు

# మృతుల కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

- 3గంటల పాటు ధర్నా చేసిన మృతుల బంధువులు
- స్పీకర్ హామీతో ధర్నా విరమించిన కుటుంబ సభ్యులు, బంధువులు



పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

**చేవెళ్ల, మేజర్‌న్యూస్ (ఆగస్టు 26) :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి పరిహారంతో పాటు ఉద్యోగం కల్పించాలని కుటుంబ సభ్యులు, బంధువులు, తోటి ఉద్యోగస్తులు, వివిధ సంఘాల సభ్యులు మంగళవారం చేవెళ్లలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై 3గంటల పాటు ధర్నా చేపట్టారు. సోమవారం సాయంత్రం బస్టాండ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోట్‌పల్లి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన తాండ్ర రవీందర్ కూతురు కృప మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున్న ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. జాతీయ రహదారిపై బైఠాయించి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేపట్టారు. పోలీస్,రెవెన్యూ అధికారులు సముదాయించిన వినకుండా మూడు గంటల పాటు ధర్నా చేపట్టారు. వాహనాలు కిలో మీటర్ల మేర ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఐలు భూపాల్ శ్రీధర్, కాంతిరెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య కుటుంబ సభ్యులతో చర్చలు జరిపిన ఫలితం లేదు. ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.కోటి పరిహారం, ఇల్లు మంజూరు చేశారు. ఇదే విషయంపై స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ కు వివరించగా కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతుని కుటుంబాకి ఉద్యోగం, పరిహారం, ఇల్లు కావాలంటూ వ్రాతపూర్వకంగా ఇస్తే ప్రభుత్వానికి పంపిస్తామని సీఐ నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు. 3గంటల పాటు ధర్నా చేయడంతో ఇరువైపులా 3కిలో మీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ట్రాఫిక్, పోలీస్‌శాఖ అధికారులు ట్రాఫిక్‌ను పునఃరుద్ధరిం చడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.




# అందెల శ్రీరాములుకి బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆహ్వానం

బాలాపూర్ మేజర్ న్యూస్(ఆగస్టు 26):నేటి నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ మహేశ్వరం నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవు ను కలిసి ఆహ్వానించిన ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి తో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ గ్రామస్తులు నవారు శ్రీనివాసరెడ్డి, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, కొంతం సంపత్ రెడ్డి, రావుల మల్లేష్, శంకర్ రెడ్డి, చైతన్య, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మట్టి ప్రతిమలు స్థానికులకు అందజేత...




**మణికొండ, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని బుద్ధోలు శ్రీరాములు అన్నారు. మణికొండ మున్సిపల్‌లోని ఆర్.కె. సర్కిల్ వద్ద ప్రతి యేటా జరుగుతున్నట్లు గానే మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నార్సింగి మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ బుద్ధొళు శ్రీరాములు, మార్కెట్ కమిటి డైరెక్టర్ ఏర్పుల కుమార్ స్థానికులకు అందజేశారు. ఈ కర్యాక్రమంలో కెపిఆర్. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గంగాధర్, శ్రవణ్‌కుమార్, పంపాల రాజు, విజయలక్ష్మి స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలలో మాక్ ఎన్నికలు..




**మణికొండ, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** మణికొండ మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలపైన అవగాహన కల్పిస్తూ 1040 మంది విద్యార్థులకు మాక్ ఎన్నికలను నిర్వహించి లీడర్‌ని ఎంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి పాల్గొని ఎన్నికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలురలో 10వ తరగతి విద్యార్థి ఎం. వివేక్, బాలికలో 10వ తరగతి విద్యార్థి ఏ. కావేరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి వారికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తె లిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్నికల పై ఒక అవగాహ న వస్తుందని తెలిపారు. అనంతరం ఎడ్యుకేషన్. ఎం.డి.ఎ. స్పోర్ట్ కల్చర్ ఈకో క్లబ్ హెల్త్ కమిటిలు ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.బీరప్ప, బి. రవికాంత్‌రెడ్డి, బి. శివ, స్కూల్ ప్రధానోపాధ్యాయులు నిరంజన్, ఉపాధ్యాయులు వరలక్ష్మి, విజయ్ సత్యం, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల చుట్టూ రక్షణ చర్యలు తీసుకోవాలి

- గడ్డిన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోపాటు పలువురు నేతలు కెఎల్ఆర్ కు విజ్ఞప్తి
- వెంటనే స్పందించి కేఎల్ఆర్ కమిషనర్ సరస్వతికి చెరువుల చుట్టూ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు




చెరువులపై రక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.

**బాలాపూర్ మేజర్ న్యూస్( ఆగస్టు 26):** బడంగ్ పేట్ లోనున్న చెరువుల చుట్టూ ఫెన్సింగ్ తోపాటు రక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు లక్ష్మారెడ్డి దృష్టికి తెచ్చిన వెంబడే కమిషనర్ సరస్వతికి ఫోన్ చేసి అతి త్వరలో చెరువుల పై చర్యలు, వాటికి రక్షణ కల్పించాలని ఆయన కోరారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్గుల్ గ్రామం సున్నం చెరువులో సోమవారం ఓ బాలుడు పడి మృతి చెందిన ఘటనపై కాంగ్రెస్ పార్టీ గడ్డన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డినీ తుక్కుగూడ పార్టీ కార్యాలయంలో కలిసి చెరువులో జరుగుతున్న దుర్ఘటన పై చర్యలు తీసుకోవాలని కోరారు. కెఎల్ఆర్ వెంటనే స్పందించి బడంగ్ పేట్ కార్పొరేషన్ కమిషనర్ పి సరస్వతికి ఆదేశాలు ఇచ్చారు. ఫేన్సింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారనీ ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జైహింద్, బంగారు అశోక్, కుమార్ యాదవ్, పుట్టగళ్ల భాస్కర్ సహా ఇతరులు ఉన్నారు.

# జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

## – మట్టి వినాయక విగ్రహాలే ప్రతిష్ఠించాలి : కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి


మట్టి వినాయకుల విగ్రహాలని పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్


26 మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని.. పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్(ఆగస్టు,26) :** విఘ్నాలు తొలగి సకల శ్రేయస్సులు చేకూరాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ మాట్లాడుతూ – "ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన వినాయక విగ్రహాలు నీటి వనరులను తీవ్రంగా కాలుష్యం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడటం కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే ప్రతిష్ఠించాలి. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములం కావాలి" అని సూచించారు.కలెక్టరేట్ ఆవరణలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ జరిగింది. అనంతరం మట్టి గణపతి విగ్రహాలు, పర్యావరణ అవగాహన గోడపత్రికలను తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టర్ విడుదల చేశారు. కలెక్టరేట్ సిబ్బందితో పాటు ప్రజలకు కూడా మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. కూకట్పల్లి, బాలానగర్, జీడిమెట్ల ఏరియాల్లో ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంచారు. పర్యావరణ అవగాహన కోసం గోడపత్రికల ద్వారా సందేశాలను చేరవేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి జేవల్సి హరిప్రియ, కలెక్టరేట్ పరిపాలన అధికారి రామ్మోహన్, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త జి.లింగయ్య, ప్రాజెక్ట్ అనలిస్ట్ డి.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్టాంప్స్-రిజిస్ట్రేషన్ శాఖలో సదుపాయాల కల్పనపై... బీజేపీ మెమొరాండం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలంటూ భారతీయ జనతా పార్టీ తెలంగాణ నాయకులు రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు.
మెమొరాండంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు తగిన భవనాలు లేకపోవడం, సిబ్బంది కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త భవనాలు కేటాయించినప్పటికీ వాటిని కార్యనిర్వహణలోకి తీసుకురావడంలో ఆలస్యం జరుగుతోందని తెలిపారు.
నాయకులు తమ డిమాండ్లను స్పష్టంగా వెల్లడించారు. జిల్లా వారీగా కొత్త సబ్-రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తగిన సిబ్బంది నియామకం జరగాలని, రిజిస్ట్రేషన్ ఫీజులపై ఇటీవల చేసిన పెంపులను వెనక్కి తీసుకోవాలని, ఆన్‌లైన్ సదుపాయాలను బలోపేతం చేసి పారదర్శక సేవలు అందించాలని కోరారు. అలాగే దరఖాస్తులు పెండింగ్ లేకుండా తక్షణ పరిష్కారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల సమీకరణపై పునరాలోచన చేయాలి:**

ప్రభుత్వం ప్రతిపాదించిన సమీకృత సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్ణయం ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారుతుందని బీజేపీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనలపై పునరాలోచన చేసి, ప్రస్తుతం ఉన్న చోట్లనే అన్ని సౌకర్యాలతో నూతన భవనాలను నిర్మించాలంటూ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు.
బీజేపీ ప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఇన్స్పెక్టర్ జనరల్‌ను కలిసి అభ్యర్థన సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నిచోట్ల ఇప్పటికే నూతన భవనాలలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కొనసాగుతున్నాయని, ఇంకా భవనాలు లేని చోట్లకు తగిన బడ్జెట్ కేటాయించి అక్కడే నూతన భవనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రం జిల్లాకు అన్ని ప్రాంతాలకు అనుకూలమైన కేంద్ర ప్రదేశంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కానీ మండలాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు మాత్రం ఆయా మండల కేంద్రాల్లోనే కొనసాగాలని, వాటిని తరలించే యత్నం చేస్తే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదని ప్రభుత్వాన్ని బీజేపీ హెచ్చరించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతుందని హెచ్చరించారు.
మెమొరాండం సమర్పణలో మేడ్చల్ జిల్లా పట్టణ అధ్యక్షుడు డా. ఎస్. మల్లారెడ్డి, రూరల్ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు పి. రాజ్ భూపాల్ గౌడ్, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



**వికారాబాద్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ కొత్తగడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సుభాష్ నగర్ ప్రాంతంలో డెంగ్యూ అనుమానిత పాజిటివ్ కేస్‌ని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్ యాదవ్ సందర్శించారు. వైద్యాధికారి అసిస్టెంట్ మలేరియా అధికారి, ప్రాంత క్షేత్రస్థాయి సిబ్బంది డెంగ్యూ అనుమానిత కేసు ఉన్న ఇంటి పరిసరాలలో దోమలు మరియు లార్వాల నివారణ మందులను చల్లడం జరిగినది. చుట్టూ ఉన్న100 ఇండ్లను సందర్శించి డెంగీ పై అవగాహన కల్పించారు . దీనిలో భాగంగా ప్రతి ఇంటి లో టెమీ పాస్ కెమికల్‌తో లార్వా నియంత్రణ చర్యలు చేయడమైనది.
అదేవిధంగా పైరిత్రం స్ప్రే చేయడమైనది. ప్రజలందరూ కూడా దోమలను నియంత్రించే చర్యలలో భాగంగా వారి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పెరగకుండా నీటి నిల్వ ప్రాంతాలు లేకుండా చూసుకోవాలని, ఇంటిపై ఉన్న ట్యాంకులకు మూతలు ఉండే విధంగా చూసుకోవాలని, ఇంటి పరిసరాలలో పాత టైర్లు, పూల కుండీలలో నీరు నిల్వ ఉండడం, తాగి పారవేసిన కొబ్బరి బొండాలు మరియు ఏ విధంగానైనా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఉదయం మరియు సాయంకాలం వేళ దోమలు ఇంట్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ కాటు నుండి రక్షణ కొరకు దోమతెరలు వాడాలని అవగాహన కల్పించడం జరిగినది సుభాష్ నగర్, గంగారం,రాజీవ్ గృహకల్ప ,ఓఎడ కాలనీ నందు ప్రతిరోజు డ్రై డే నిర్వహించాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర యాదవ్ సిబ్బందికి సూచించడం అయినది.

# ఎస్సీ, బీసీ వసతి గృహాల సందర్శన


బీసీ వసతి గృహంలో విద్యార్థులతో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తార్యానాయక్

**కొడంగల్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** కొడంగల్ పట్టణంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తార్యానాయక్ మంగళవారం సందర్శించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, మౌలిక వసతులపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచడం జరిగిందన్నారు. దీంతో పాటు వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుతూ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.


ఎస్టీ వసతి గృహంలో వార్డెన్‌తో మాట్లాడుతున్న తార్యానాయక్

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఆరోపణలు అవాస్తవం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**కొడంగల్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ హస్నాబాద్ గ్రామ కమిటీ అధ్యక్షుడు టీ.భీములు అన్నారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలోని హస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కృష్ణ సోమవారం ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల నుంచి కాంగ్రెస్ నాయకులు ఒక్కొక్కరి నుంచి రూ.5వేలు వసూలుకు పాల్పడుతున్నారని చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు. అదే విధంగా బీఆర్ఎస్ నాయకులకు ఒక్క ఇంటిని కూడా మంజూర్ చేయలేదని ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. గ్రామంలో పార్టీలకతీతంగా ఇళ్లు లేని అర్హులైన వారిని గుర్తించి 46 ఇళ్లను ప్రభుత్వం మంజూర్ చేయడం జరిగిందన్నారు.
గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి ఆరోపణలకు పాల్పడుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గ్రామంలో ఎంత మందికి ఇళ్లు మంజూర్ అయ్యాయోనని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంవత్సర కాలంలోనే గ్రామంలో రూ.1 కోటి 65 లక్షలతో నూతన పాఠశాల భవనం, మహిళ సమాఖ్య భవనం, వీధి లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరోసారి లేని పోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తాజున్నీసాబేగం, జులేఖ బేగం, అంజమ్మ, మల్లమ్మ, పద్మమ్మ, రేణుక, కాంగ్రెస్ నాయకులు రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులతో పర్యావరణం సురక్షితం

- మహేశ్వరం ఏసిపి జానకి రెడ్డి
- వైఆర్‌పిఫౌండేషన్, వైష్ణోయ్ గ్రూప్ ఆధ్వర్యంలో మామిడిపల్లి గ్రామంలో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



**జల్ పల్లి, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని సురక్షితంగా ఉంచాలని మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి అన్నారు. వినాయక చవితి పురస్కరించుకొని సోమవారం మామిడిపల్లి దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద వై ఆర్ పి ఫౌండేషన్ చైర్మన్ యేలిశాల రవి ప్రసాద్, వైష్ణోయ్ గ్రూప్ చైర్మన్ ఎడ్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వరం ఏసిపి జానకి రెడ్డి, పహాడీ షరీఫ్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి పాల్గొని గ్రామ ప్రజలకు గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపి జానకి రెడ్డి మాట్లాడుతూ. వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ మట్టి గణపతులను పూజిస్తూ, పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. మంచి ఆలోచనతో పేద ప్రజలకు సేవలందిస్తున్న వై ఆర్ పి ఫౌండేషన్, వైష్ణోయ్ గ్రూప్ సంస్థకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎడ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ. వై ఆర్ పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు సేవలు అందిస్తూ, గత ఎనిమిది సంవత్సరాల నుండి ఫౌండేషన్ ద్వారా పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్, నల్గొండ జిల్లాలలో పదివేల మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశామని, అందులో భాగంగా మామిడిపల్లి గ్రామంలో వెయ్యి మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్టించి ప్రకృతిని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల వాసుదేవా రెడ్డి, ఎడ్ల రఘువీరా రెడ్డి, మాజీ కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్ యాదవ్, సుక్క శివకుమార్, గ్రామస్తులు నందీశ్వర్, భాస్కర్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, రంగనాథ్, శ్రీనివాస్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, లాల్ రాజు గౌడ్, ఈరంకి రాజు గౌడ్, దిలీప్, కోట్ల వెంకటేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ స్ప్రే పిచికారీ తక్కువ సమయంలో ఎక్కువ ప్రయోజనం

డ్రోన్ స్ప్రేయింగ్ అవగాహన కార్యక్రమం



రైతులకు సూచనలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు

కందుకూరు,మేజర్ న్యూస్ (ఆగస్టు 26): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం నేదునూరు గ్రామంలో మంగళవారం డ్రోన్ స్ప్రేయింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ తో నానో ఎరువుల పిచికారీ నిర్వహించారు. మండలం వ్యవసాయ అధికారిని వై. లావణ్య, సీఆర్ఐడిఏ (సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్) కేవీకే రంగారెడ్డి ఆధ్వర్యంలో సంయుక్తంగా రైతులలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించినట్లు రైతులకు డ్రోన్ స్ప్రేయింగ్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. సమానంగా ఎరువులు/పిస్టిసైడ్లు పడడం,తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం కవర్ చేయడం,శ్రమ తగ్గడం, రసాయనాల ప్రభావం నుండి భద్రత,ఉత్పాదకత పెరుగుదల, ఖర్చులు తగ్గించడం వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి డా. చంద్రకాంత్ ఎం.హెచ్, హెడ్ కేవీకే , డా. ఎస్. విజయ్‌కుమార్ వ్యవసాయ ఇంజనీరింగ్. టి.వి.రావు ప్రధాన శాస్త్రవేత్త, క్రీడా. భార్గవి, శాస్త్రవేత్త (అగ్రానమీ)డా. గౌతమ్ వీర్ చౌహాన్ ఎస్ఎంఎస్ (అగ్రానమీ)టెక్నికల్ ఆఫీసర్ శ్రీ జి. రాజు, యువ ప్రొఫెషనల్స్ డి. సునీత, సాయికుమార్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 7 మంది రైతుల్లో 4 మంది మొక్కజొన్న పంట, 3 మంది వరి పంట వద్ద పిచికారీ చేశారు.స్థానిక రైతులు మల్లేశ్, మత్యాస్ రెడ్డి, అంజయ్య, సామ్యూల్ రెడ్డి 30 మంది రైతులు హాజరయ్యారు.రైతులు ప్రత్యక్ష ప్రదర్శనలో పాల్గొని ప్రయోజనాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం ద్వారా ఆధునిక సాంకేతికత ఆధారిత వ్యవసాయ పద్ధతులు అవలంబించడం రైతుల ఉత్పాదకత పెంచడంతో పాటు, ఖర్చులను తగ్గించడంలో కీలకమని రైతులకు సూచించారు.

# మదర్‌థెరిస్సా జీవితం అందరికి ఆదర్శం

– డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి



మదర్‌థెరిస్సా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిసిసి అధికారప్రతినిధి, నాయకులు

**కడ్తాల్, మేజర్‌న్యూస్ (ఆగస్టు 26):** మానవాళికి ప్రేమ, దయ ప్రాముఖ్యతను చాటిన సేవామూర్తి మదర్ థెరిస్సా జీవితం ప్రజలందరికి ఆదర్శప్రాయమని డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో మంగళవారం మదర్‌థెరిస్సా జయంతి కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోసు రవి, నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
అనంతరం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మదర్ థెరిస్సా జీవితం మానవత్వానికి నిదర్శనమన్నారు. మతం, కులం, జాతి అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరిని తన సంతానంలా చూసిన మహనీయురాలని ఆయన కొనియాడారు. పేదవారికి, అనాథలకు, రోగులకు ఆశ్రయం ఇచ్చి, జీవితాంతం సేవ చేసిన ఆ త్యాగమూర్తి జీవితం సర్వమానవాళికి ఆదర్శప్రాయమన్నారు
ప్రతి ఒక్కరు మదర్‌థెరిస్సా చూపిన దారిలో నడుస్తూ పేదల కోసం, బలహీన వర్గాల కోసం, అనాథల కోసం నిరంతరం కృషి చేయాలని డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, మండల అధ్యక్షుడు బోసు రవి, మండల ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, యూత్ కడ్తాల్ పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు గురిగళ్ళ రామకృష్ణ, క్రర్రోళ్ల రమేష్, కాళే శ్రీకాంత్, సోమరాజు సందీప్, గోసుల మల్లేష్, గంజి చందు, వినీత్ నాయక్, శ్రీను నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు భూ సేకరణ చట్టం ప్రకారం

# ప్రతి రైతుకు పరిహారం

- అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి



**కందుకూరు మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి రైతుకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం రైతులకు పరిహారం అందజేయడం జరుగుతుందని అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కందుకూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రీన్ ఫీల్డ్ రాడియల్ రోడ్డు భూ నిర్వాసితులకు కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 36 కోట్ల 80 లక్షల 35 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిమ్మాపూర్, రాచులూరు భూ నిర్వాసితుల భూములు కోల్పోతున్నారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు నుండి రావిరాల మీరాం మీర్ ఖాన్ పెట్ ఫార్మాసిటీ వరకు 18 కిలోమీటర్ల మేర భూమి కోల్పోతున్న 49 మంది రైతులకు పరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. దీనితో మొదటి దశ పరిహారం ఇవ్వడం జరిగిందని అదనపు కలెక్టర్ కలెక్టర్ తెలిపారు కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాజు, కందుకూరు తహసిల్దార్ కె. గోపాల్, అధికారులు రైతులు పాల్గొన్నారు.

## కొత్తగూడ ముదిరాజ్ సంఘం కమిటీ ఏర్పాటు



**కందుకూరు, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** మండలంలోని కొత్తగూడ గ్రామంలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీని మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు పిట్టల పాండు ఆధ్వర్యంలో ఏకగ్రీవం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పిట్టల యాదయ్య, ఉపాధ్యక్షులు మెరుగు కృష్ణ,కార్యదర్శి చీమల శేఖర్, యూత్ అధ్యక్షులు తాళ్ల మహేందర్, ఉపాధ్యక్షులు పిట్టల శ్రీరాములు,కార్యదర్శి గడ్డగూటి శివ, మండల కమిటీ సంఘం పెద్దలు కాకి మధు, జంగయ్య, తాళ్ల బాలేష్, తాళ్ల నరసింహ, పిట్టల నరసింహ, చీమల సురేష్, తాళ్ల బిక్షపతి, తాళ్ల రవి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కోఆప్షన్ సభ్యులు షబ్బీర్‌అలీకి

# కాంగ్రెస్ నాయకుల నివాళి

- నివాళులర్పించిన కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు,



మాడ్గుల, మేజర్‌న్యూస్ (ఆగస్టు 26):మాడ్గులకు చెందిన మండల మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ షబ్బీర్ అలీ గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఈనెల 25న రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు షబ్బీర్‌అలీ మృతదేహం మాడ్గులకు చేరుకున్న విషయం తెలుసుకున్న మాజీ ఎంపిపి అన్నెపాక జంగయ్య, మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్యగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూధిని కోదండ వెంకట్‌రెడ్డి, గాని అరవింద్‌గౌడ్, మొక్తాల కృష్ణయ్యగౌడ్ తదితరులు షబ్బీర్‌అలీ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మండల కోఆప్షన్ సభ్యులుగా, కాంగ్రెస్ నేతగా ప్రజలకు అందించిన సేవలను వారు గుర్తుచేశారు. నివాళులర్పించినవారిలో కాంగ్రెస్ నాయకులు మహేష్,, అబ్బాస్ అలీ, హుసేన్ తదితరులు ఉన్నారు.

# యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదనే భరోసా ఇవ్వాలి...

● వ్యవసాయ శాఖ అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశం



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదనే భరోసా ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు.మంగళవారం కలెక్టరేట్లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో యూరియా లభ్యత, సరిహద్దుల్లో చెక్ పోస్టల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రైతులకు యూరియా లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉంచే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గత సంవత్సరం జిల్లాలో 19764 మెట్రిక్ టన్నుల యూరియాను అందించడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా ఇప్పటివరకు 19534 మెట్రిక్ టన్నుల యురియా సరఫరా చేయడం జరిగింద న్నారు. వారం రోజుల్లోగా జిల్లాకు అదనంగా 1080 మెట్రిక్ టన్నుల యూరి యా రావాల్సి ఉందని ఆయన తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు యూరియా విక్రయ కేంద్రాల వద్ద ఉంటూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ రైతులకు యూరియా అందే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా నుండి యూరియా అక్రమంగా ఇతర ప్రాంతా లకు తరలించకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను నిర్వహి ంచి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి యూరియా ఇతర ప్రాంతాలకు తరల కుండ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. నానో యూరియాను నేరుగా మొక్కలు, ఆకులపై పిచికారి చేయవచ్చు అనే విషయాన్ని రైతులకు తెలియజేస్తూ వారిని ప్రోత్సహి ంచాలని ఆయన అధికారులకు సూచించారు. ఇప్పటికీ జిల్లాలో 1000 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. నానో యూరియా ను ఉపయోగించడం ద్వారా రైతులు సాంప్రదాయ యూరియా ఏరువులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, ఏడిఏ సందీప్ కు మార్, ఏడిలు ప్రసన్న లక్ష్మి, శంకర్ నాయక్, వెంకటేశం పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ...



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):**వికారాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో వినాయక చవితి వేడుకను పురస్కరించుకుని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సుధీర్ మరియు అసిస్టెంట్ కలెక్టర్ హర్ష హర్ష చౌదరిలు అధికారుల కు, ఉద్యోగులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...., జిల్లాలో 12000 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి “గణపతి విగ్రహాలను చెరువుల మట్టి తో తయారు చేసి చెరువు లోనే నిమజ్జనం చేద్దాం” పోస్టర్ ను విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను కాలుష్య నియంత్రణ మండలిఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్టిం చాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనిక రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్టించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ సిధార్థ, జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణ వేణి, జిల్లా పంచా యతీ అధికారి జయసుధ, డిపిఆర్ ఓ చెన్నమ్మ, డిటిడిఓ కమలాక ర్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపం ఏర్పాటుకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి

● శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

● ఎస్ఐ వసంత్ జాదవ్

**దోమ, మేజర్ న్యూస్ (ఆగస్టు 26)ః**
వినాయక మండపం ఏర్పాటుకు ముందుగానే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని అనుమతి పత్రంను పొందాలని దోమ ఎస్ఐ వసంత్ జాదవ్ అన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక చవితి సందర్భంగా మండల,గ్రామాల ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపం ఏర్పాటుకు ఆన్లైన్లో అప్లైచేసిన తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్ కు దరఖాస్తు కాపీ ఖచ్చితంగా సమర్పించాలని వెల్లడించారు. మండపాలను రహదారులు, అంబులెన్స్ మార్గాలు, అగ్నిమాపక వాహనాల మార్గాలకు అడ్డంకులు కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని,విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా అమర్చాలని,షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకొని తప్పనిసరిగా ఉంచాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే వాడాలని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులు వాడరాదనీ,ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. అధిక శబ్దం,డీజే మ్యూజిక్ వాడరాదని పేర్కొన్నారు. ఊరేగింపుల కోసం ముందస్తు అనుమతి తీసుకుని,పోలీసులు సూచించిన మార్గంలోనే జరపాలని అన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామ న్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపిడిఓ గ్యామా , దోమ మండల ప్రజాప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వసంత్ జాదవ్



సమావేశానికి హాజరైన దోమ మండల వివిధ గ్రామాల యువకులు,ప్రజాప్రతినిధులు.

# జుంటుపల్లి రామస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు

● హుండీ లెక్కించగా ఆదాయం రూ “ 90,228 రూపాయలు వచ్చినట్లు

● ఆలయ ఇంచార్జి మేనేజర్ రాజేందర్ రెడ్డి, చైర్మన్ శ్యాంసుందర్ రావు తెలిపారు



యాలాల మేజర్ న్యూస్:(ఆగస్టు 26) మండలం పరిధిలోని జుంటుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది. శ్రావణమాసం మూడు నెలల రోజులు భక్తులు సందర్శించుకుని హుండీలో వేసిన కానుకలను లెక్కించారు,ఈ సందర్భంగా దేవాదాయ శాఖ జుంటుపల్లి రామస్వామి దేవాలయం మేనేజర్ రాజేందర్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ శ్యాంసుందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు,హుండీ లెక్కించగా రూ “ 90,228 రూపాయలు వచ్చినట్లు తెలిపారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు వేసిన కానుకలను దేవాలయ అభివృద్ధి కోసం వినియోగించడం జరుగుతుందని తెలిపారు, వికారాబాద్ జిల్లా అనంతగిరి అనంతపద్మనాభ స్వామి దేవాలయం ఆలయ ఈవో నరేందర్ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు,ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ ఫౌండర్ సభ్యులు రాఘవేందర్ రావు,భజన భక్తులు ఆశన్న సుదర్శన్ గౌడ్, భీమయ్య ప్రకాష్ గౌడ్ ఆలయ అర్చకులు వదురాజ్ పంతులు పాల్గొన్నారు.



## న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం అవసరం....

● జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బస్వరాజ్ పటేల్

● వికారాబాద్ జిల్లా న్యాయవాదుల నిరసన




**వికారాబాద్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):**
న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం అవసరమని వికారాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బస్వరాజ్ పటేల్ అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కోర్టులో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. సోమవారం కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఈసి సభ్యుడు న్యాయవా ది తన్నీరు శ్రీకాంత్‌పై కొంతమంది దుండగులు దాడి చేసిన ఘటనకు నిరసనగా వికారాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదు లు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ మాట్లాడుతూ, “రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం అవసరం అత్యవసరం అయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉంది” అని అన్నారు. న్యాయవాదులంతా కలసికట్టుగా రక్షణ చట్టం కోసం ఉద్యమిం చాల్సిన సమయం వచ్చిందని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పోలీస్ వెంకట్ రెడ్డి, న్యాయవాదులు కామల్ రెడ్డి, లవకుమార్, గోవర్ధనరెడ్డి, గోపాలరెడ్డి, యాదవ్ రెడ్డి, సంపూర్ణనంద్, శంకరయ్య, మాధవ్ రెడ్డి, శుక్లవర్ధన్ రెడ్డి, మొహద్ రఫీ, అశోక్ కుమార్, శుభప్రద్ పటేల్, ఆనంద్ గౌడ్, గోపాల్, రాజశేఖర్ ఆవుటి, మోహన్ రాజు, బాలయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# "ఫెడరేషన్"లో నియంతృత్వ పోకడల్లేవ్..!


సన్నాహక కమిటీ ఛైర్మెన్ సురేష్


సన్నాహక కమిటీ అధ్యక్షులు రఘుపతి


కార్యదర్శి శ్రీనివాసా చారి

- టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య
- ఫెడరేషన్‌లో నిబద్ధతగా కష్టపడే వారికే గుర్తింపు
- మన ఐక్యతే వారికి సమాధానం
- ఫెడరేషన్ ఎవరికి భయపడదు
- రంగారెడ్డి జిల్లా టి డబ్ల్యూ ఎఫ్ 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేద్దాం
- టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా మహాసభ సన్నాహక సమావేశం

**మొయినాబాద్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌లో ఇలాంటి నియంతృత్వ పోకడలు లేవని, జర్నలిస్టుల ఐక్యతనే సంఘం బలం బలగమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి వద్ద పావని ఫామ్ హౌజ్‌లో రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫెడరేషన్ మూడవ మహాసభల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రఘు రాజశేఖర్‌లు హాజరయ్యారు.

రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, ఎం. సైదులు ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుండి ఫెడరేషన్ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో జాతీయ కమిటీ సభ్యులు దేవేందర్, రంగారెడ్డి జిల్లా సీనియర్ జర్నలిస్టులు గణేష్, శ్రీనివాసాచారి, చంద్రశేఖర్, సురేష్, ఎండి ఖాజా పాషా (కేపీ) జిల్లా కమిటీ సభ్యులు లక్క్యాకుల రమేష్ కుమార్, నరసింహారెడ్డి, ఆంజనేయులు పలువురు నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు ఇతర జర్నలిస్టులు తమ అభిప్రాయాలను సద దృష్టికి తెచ్చారు. అనంతరం ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. వచ్చే నెల త్వరలోనే నిర్వహించనున్న టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభను కనీవినీ ఎరగని రీతిలో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లాలో ఫెడరేషన్ బలోపేతం చేద్దామంటూ జర్నలిస్టులను కోరారు. జర్నలిస్ట్ హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలతో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. నియంతృత్వ ధోరణి పోకడలకు టిడబ్ల్యూజేఎఫ్ ఎల్లప్పటికీ దూరంగా ఉంటుందన్నారు. నిబద్ధతతో పనిచేసే వారికి సంఘంలో మొదటి ప్రాధాన్యత ఉంటుందని సూచించారు. జర్నలిస్టుల అభీష్టం మేరకే కమిటీల ఎన్నిక ఉంటుందని గుత్తాధిపత్యం, ఇతర రికమండేషన్లు చెల్లవని చెప్పారు.

పనిచేసే వారికి పదవులు లభిస్తాయని సంఘం వారికి పెద్ద పీట వేస్తుందని అన్నారు. ఇతర సంఘాలలో ఇలాంటివి చాలా అరుదని అన్నారు. ఇష్ట రాజ్యాంగ ఏకచత్రాధిపత్యంతో సొంత నిర్ణయాలు చలామణి అవుతాయని కానీ ఫెడరేషన్ మాత్రం ఒక నిజాయితీ నిబద్ధత కలిగి ఉంటుందని గుర్తు చేశారు. ఫెడరేషన్ గత కొద్ది కాలంలో పెద్ద ఎత్తున బలోపేతం అవుతుందని తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో టీయూడబ్ల్యూజే ఐజేయు సంఘాల నుండి వలసలు పెరిగాయని జర్నలిస్టులు నిబద్ధత కలిగిన ఫెడరేషన్ సంఘానికి మద్దతుగా వస్తున్నారని ఇది ఎంతో శుభ పరిణామం అని బసవ పున్నయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా మూడవ మహాసభలు ఏ ప్రాంతంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీకి అభ్యంతరం లేదని జర్నలిస్టుల అభిప్రాయమే రాష్ట్ర కమిటీ అభిప్రాయం అని స్పష్టం చేశారు. సంఘంలోని జర్నలిస్టుల్లో ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ఇతర సంఘాల నాయకులు కుట్ర పన్నుతున్నారని వారి బారిన పడకూడదని సూచించారు. కనివిని ఎరుగని రీతిలో ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా మహాసభలు జరగాలన్నదే తమఅభిమతం అని తెలిపారు.

**రంగారెడ్డి జిల్లాలో ఫెడరేషన్ తడాఖా చూపిస్తాం – ఎం. సైదులు**

రంగారెడ్డి జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా మూడవ మహాసభలలో తమ సంఘం తడాఖాను చూపిస్తామని రంగారెడ్డి జిల్లా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం సైదులు ధీమా వ్యక్తం చేశారు. సన్నాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ కోసం వివిధ విభాగాల సన్నాహక కమిటీలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్యతో కలిసి ప్రకటించారు.

**అనంతరం ఆయన మాట్లాడుతూ ..**

రంగారెడ్డి జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో ఫెడరేషన్ ఎంతో బలపడుతుందని జిల్లాలో దాదాపు 400కు పైగా జర్నలిస్టులు సభ్యత్వం తీసుకోవడం శుభపరిణామం ఆయన అన్నారు. రాష్ట్ర కమిటీ సూచనలు సలహాలు మద్దతు ఎంతో అండగా నిలిచిందన్నారు.

మహాసభలను విజయవంతం చేయడం కోసం ప్రతి జర్నలిస్టు బాధ్యత తీసుకోవాలని సూచించారు. చిన్న పెద్ద నాయకులు కార్యకర్తలు అనే భేదాభిప్రాయాలు లేకుండా ప్రతి ఒక్కరు ఐక్యతతో మహాసభలను విజయవంతం చేయాలని సైదులు సూచించారు.

**రంగారెడ్డి జిల్లా టిడబ్ల్యూఎఫ్ సమన్వయ సన్నాహక కమిటీ**

రంగారెడ్డి జిల్లా టిడబ్ల్యూఎఫ్ సమన్వయ సన్నాహక కమిటీనీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య ప్రకటించారు. ఇందులో అనేక విభాగాలకు సంబంధించిన కమిటీలను నిర్ణయించారు. ఆహ్వాన కమిటీ, ప్రచార కమిటీ, సభా ప్రాంగణ కమిటీ, భోజనాల నిర్వహణ కమిటీలతో పాటు మరికొన్ని కమిటీలను వారు ప్రకటించారు.

ఇందులో ప్రధానంగా ఆహ్వాన కమిటీలో టిడబ్ల్యూజెఎఫ్ రంగారెడ్డి జిల్లా తృతీయ మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ గా చిలీవేరు సురేష్, అధ్యక్షులుగా వి.రఘుపతి, కార్యదర్శిగా శ్రీనివాసాచారి, కోశాధికారిగా నోముల శ్రీశైలం, ఉపాధ్యక్షులు శేరిబాయి గణేష్, లక్క్యాకుల రమేష్ కుమార్, యాదగిరి, ఆంజనేయులు, నరసింహారెడ్డి, సిహెచ్ రాజు, సురేందర్, డి.శంకర్, సహాయ కార్యదర్శిగా ఎం. సైదులు, జోగు శ్రీనివాస్, ఎస్.చంద్రశేఖర్, మిద్దెల సత్యనారాయణ, నరేష్, జగన్, నరసింహ, రఘునందన్, ఈసీ మెంబర్లుగా వివిధ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఉన్నారు. గౌరవ అధ్యక్షులుగా బి. దేవేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా జిల్లా మహాసభ నిర్వహణ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. సమన్వయ కమిటీ, ప్రచార కమిటీ, జర్నలిస్టుల సమీకరణ తదితర కమిటీల తోపాటు 60 మందితో వివిధ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది.

## మట్టి గణపతులను పూజించండి
# పర్యావరణాన్ని కాపాడండి...

- పీర్జాదిగూడ నగర కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు
- మేడిపల్లి తాసిల్దార్ హసీనా వెల్లడి




**మేడిపల్లి, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని మేడిపల్లి తాసిల్దార్ హసీనా, పీర్జాదిగూడ నగరపాలక సంస్థ కమిషనర్ త్రిలేశ్వ ర్ రావు అన్నారు. ఈ మేరకు పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు మట్టి గణపతులను పూజించడం వలన పర్యావరణన్ని పరిరక్షించడంతో పాటు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలని సూచించారు.నగరపాలక సంస్థ పరిధిలో ఐదు చోట్ల ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. పర్యావరణ హితంగా ఈ పండుగ జరుపుకోవాలని కోరారు. అనంతరం పోలీస్ శాఖతో కలిసి పిర్జాదిగూడ చెరువులో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నగరపాలక సంస్థ ప్రజలందరికీ ముందస్తుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభా, డిప్యూటీ ఇంజనీర్ సాయినాథ్ గౌడ్ ,మేనేజర్లు క్రాంతికుమార్ కిషోర్ కుమార్ అసిస్టెంట్ ఇంజనీర్ వినీల్ గౌడ్ ,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రశాంతి ,సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ఆక్రమణలను తొలగించిన హైడ్రా అధికారులు



**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26) :** పోచారం మున్సిపాలిటీ, కాచవాని సింగారంలో మంగళవారం హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. కాచవానిసింగారం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 715లో రెండు ఎకరాల భూమిలో చౌదరిగూడ మాజీ సర్పంచ్ భర్త నక్క నర్సింహ్మా వెంచర్ చేసి 40 ప్లాట్లను నిర్మాణం చేశాడు. అందులో పవన్ కల్యాణ్ 178 ప్లాట్ ను, శంకర్ 173 ప్లాట్ ను, దేవరాజ్ 179 ప్లాట్ ను కొనుగోలు చేశారు. కాని నక్క నర్సింహ్మా వెంచర్ చేసి రోడ్లను కబ్జాచేసి ప్లాట్ల యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో ప్లాట్ల బాధితులు హైడ్రా అధికారులకు పిర్యాదు చేశారు. రికార్డులను పరిశీలించిన హైడ్రా అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డును కబ్జా చేసిన ప్రహారిగోడలను కూల్చివేసి ప్లాట్ల బాధితుల సమస్యను పరిష్కరించారు. బాధితులు హైడ్రా అధికారులను కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సిబ్బంది, ప్లాట్ల బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# జెర్సీ కంపెనీపై తండావాసుల ఆగ్రహం

- వ్యర్థ జలాలు రోడ్డుపైకి - కలుషితమైన బోరుబావులు
- సెక్యూరిటీ గార్డులేక ప్రమాదాలు - దోమలు విజృంభణ

**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేషవరం తండాలో జెర్సీ డైరి కంపెనీ నుంచి వెలువడుతున్న మురికినీటితో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన భరించలేనంత స్థాయికి చేరుకోవడంతో మంగళవారం తండావాసులు కంపెనీ ముందు ఆందోళన చేపట్టి తమ సమస్యలను వెలుగులోకి తెచ్చారు. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం – కంపెనీ ప్రహారీ గోడ ప్రక్కనుంచి నేరుగా వ్యర్థ జలాలను రోడ్డుపైకి వదులుతుండటంతో చుట్టుపక్కల దోమలు, ఈగలు పెరిగి విపరీతమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో కంపెనీ వాహనాలు గేటు నుంచి వేగంగా వచ్చి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.వ్యర్థ రసాయనాలు భూమిలోకి ఇంకి బోరుబావుల నీరు కలుషితమైపోయిందని, ఆ నీటిని ఉపయోగిస్తున్న ప్రజలు చర్మరోగాలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన కుక్కలను తండా పరిసరాల్లో పడేస్తుండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆరోపించారు. రాత్రిపూట కంపెనీ నుంచి వెలువడే పొగతో శ్వాసకోస సమస్యలు ఏర్పడుతు న్నాయని, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోందని వాపోయారు.తండావాసులు స్పష్టం చేస్తూ – ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికా రులు తక్షణమే స్పందించి, కంపెనీ నుంచి వెలువడుతున్న విషరసాయనాలను పరీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


జెర్సీ కంపెనీ ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న తండావాసులు



జెర్సీ కంపెనీ..


జెర్సీ కంపెనీ నుండి వెలువడుతున్న వ్యర్థ రసాయన పదార్థాలు

# గణేష్ ఉత్సవాల సందర్భంగా పోలీస్ వారి నియమ నిబంధనలు పాటించాలి..



## మోమిన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్

**మోమిన్ పేట, మేజర్ న్యూస్(ఆగస్టు 26):** గణేష్ ఉత్సవాల సందర్భంగా పోలీసు వారి నియమ నిబంధనలను పాటించాలని మోమిన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్ తెలిపారు. మంగళవారం మోమిన్ పేట మండల కేంద్ర సమీపంలో ఉన్న రాయల్ ఫంక్షన్ హాల్లో ఎస్సై అరవింద్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో, గణేష్ ఉత్సవ కమిటీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గణేష్ ఉత్సవాలను కులమతాలక తీతంగా పార్టీలకతీతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. నిమజ్జనం వరకు నిర్వాహకులు రాత్రి వేళలో మండపాల వద్ద ఉండలన్నారు. లడ్డూల పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ సౌండ్లకు డీజేలకు అనుమతి లేదని తెలిపారు. పోలీస్ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. గణేష్ మండపాల కోసం తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి అన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం ఆడడం, అసభ్యకర రమైన నృత్యాలు చేయడం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిషేధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్ఐ సరిత, సెక్రటరీ స్వప్న, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి ఎంఐఎం పార్టీల నాయకులు, ఆయా గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీల నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుంది

● పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి



తైక్వాండోలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న తుంగతుర్తి రవి.

**మేడిపల్లి,మేజర్ న్యూస్ (ఆగస్టు 26):** క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిప్రియ నగర్లో గట్స్ తైక్వాండో ఇన్స్టిట్యూట్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ"మార్షల్ ఆర్ట్స్ కేవలం శారీరక దారుఢ్యం కోసం మాత్రమే కాదు, మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి కూడా ఉపయోగపడుతుందని, నేటి యువత క్రీడల్లో రాణిస్తే వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. విద్యతో పాటు క్రీడా రంగానికి కూడా ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, రాజ్ కుమార్, కోచ్ అనిల్, ఆర్గనైజర్ చరణ్, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను పూజించండి - పర్యావరణాన్ని పరిరక్షించండి

మేడ్చల్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):
"మట్టి వినాయకులను పూజించండి – పర్యావరణాన్ని పరిరక్షించండి" అనే నినాదంతో మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు పర్యావరణ హిత వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ఇళ్ల నుండి తెచ్చుకున్న మట్టి, సహజరంగులు, కూరగాయలు, పేపర్లు ఉపయోగించి సృజనాత్మకంగా సుమారు 50 విగ్రహాలను తయారు చేసి ప్రదర్శించారు. చిన్న చిన్న గణపతి విగ్రహాల రూపంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ చూసి ఉపాధ్యాయులు అభినందించారు. తరువాత ఉపాధ్యాయులు వినాయక చవితి యొక్క ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను దూరం పెట్టి, మట్టి వినాయకులను పూజించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు గడప నవీన్, వసీమ్, మంజుల, రంగారావు, రాంబాబు, స్వరూపారాణి, ప్రభాకర్, విజయలక్ష్మి, సోనీ తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.



# కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి..

● కుల్కచర్ల మండల బిజెపి ఉపాధ్యక్షుడు కొండ ఆంజనేయులు ముదిరాజ్



వికారాబాద్ డెస్క్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కుల్కచర్ల మండల బిజెపి ఉపాధ్యక్షుడు కొండ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా పాలన సంబురాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి. రాజీవ్ యువ వికాస్, మహాలక్ష్మీ వంటి పలు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి యేదాది నర గడుస్తున్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల పైన విశ్వాసం ఉంటే ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పర్యావరణ హిత వినాయకుడి తయారీలో ఆదర్శంగా అనిల్ కుమార్

● మట్టి వినాయక విగ్రహాల రూపకల్పనతో స్ఫూర్తినిచ్చిన యువకుడు ● తోటి స్నేహితులు

శామీర్పేట, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):పర్యావరణ హిత మట్టి వినాయక విగ్రహాల తయారీలో మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ, శామీర్పేట మండలం ఉప్పర్పల్లి గ్రామానికి చెందిన ఎం. అనిల్ కుమార్ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి ఏటా వినాయక చవితి సందర్భంగా స్వయంగా సహజ మట్టి, సహజ వర్ణాలతోనే విగ్రహాన్ని తయారు చేసి, మండపం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించడం ఆయన ప్రత్యేకత. ఎలాంటి రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించకుండా, పర్యావరణానికి హాని కలగని విధంగా విగ్రహాన్ని తీర్చిదిద్దుతూ నీటి వనరుల పరిరక్షణకు తోడ్పడుతున్నారు. "పండుగను ఆనందంగా జరుపుకోవడమే కాదు, పర్యావరణాన్ని కాపాడుకోవడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత" అని అనిల్ కుమార్ సందేశమిచ్చారు. ప్రతి సంవత్సరం ఇదే సత్సంకల్పంతో ముందుకు సాగుతున్న ఆయన గ్రామ యువతకు స్ఫూర్తిదాయకుడిగా నిలుస్తున్నారు. "ఇలాంటి మంచి ఆలోచనతో పండుగ జరుపుతున్న అనిల్ మా గర్వకారణం" అని తోటి స్నేహితులు, గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.



# ప్రథమ వర్ధంతికి హాజరైన నాయకులు



వికారాబాద్ డెస్క్, మేజర్ న్యూస్ (ఆగస్టు 26): కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గిరమోని సత్తయ్య ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్ రావు, డిసిసి ఉపాధ్యక్షుడు బొలుసని భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



# గణేష్ నవరాత్రులలో తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు

## :కీసర పోలీస్ స్టేషన్ సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు

కీసర, మేజర్ న్యూస్ (ఆగస్టు 26):
గణేష్ నవరాత్రుల సందర్భంగా మండపాల ఏర్పాటు, నిమజ్జనాల నిర్వహణలో నిర్వాహకులు, భక్తులు చట్టపరమైన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కీసర పోలీస్ స్టేషన్ సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్కరు నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ – మండపాలు ఏర్పాటు చేసేముందు పోలీస్, మున్సిపాలిటీ, విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతులు తప్పనిసరిగా పొందాలని చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (PoP) విగ్రహాలు కాకుండా, మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. మండపాలు తాత్కాలికంగానూ, బలమైన గాలి, వర్షం తట్టుకునేలా సురక్షితంగా నిర్మించాల్సిందిగా సూచించారు. డీజేలు పూర్తిగా నిషేధించబడ్డాయని, కేవలం భక్తి గీతాలకే అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల తరువాత లౌడ్ స్పీకర్లు వాడరాదని హెచ్చరించారు. డ్రోన్ల వినియోగం నిషేధమని, ప్రతి మండపంలో CCTV కెమెరాలు, తగినంత లైటింగ్ ఉండాలని ఆదేశించారు.

నిమజ్జనాల రద్దీ తగ్గించేందుకు 3వ, 5వ, 7వ రోజుల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. ఒక్క విగ్రహానికి ఒక్క వాహనం మాత్రమే వినియోగించాలని, వాహనాలు సక్రమ స్థితిలో ఉండాలని ఆయన తెలిపారు. మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం, అవాంఛిత చర్యలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మండపాల వద్ద శుభ్రత, తాగునీరు, మెడికల్ సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేయాలని సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు.

